క్లుప్తంగా

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: వర్షాల కారణంగా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. సోమవారం వర్షంనీటితో నిండిపోయిన జేఎస్ రోడ్ షిర్డిసాయి మార్గ్‌ను అధికారులతో కలసి పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించి క్షేత్రసాయి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి అక్కడ పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజుకు ఎంపీ భరత్‌రామ్ పలు సూచనలిచ్చారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు ఉన్నారు.

నేటి నుంచి జిల్లా ఆడిట్ సిబ్బంది మాస్ లీవ్

రాజమహేంద్రవరం సిటీ: ఏప్రిల్‌కు రావాల్సిన జీతభత్యాలు రాయకుండా నిలిపివేసినందుకు నిరసనగా ఆడిట్ ఉద్యోగులు మంగళవారం నుంచి మాస్ క్యాజువల్ లీవ్ పెడుతున్నట్లు లోకల్ ఫండ్ ఆడిటర్ల సంఘం నాయకుడు వరప్రసాద్ సోమవారం ప్రకటించారు. ఉద్దేశపూర్వకంగానే జీతభత్యాలు నిలుపుదల చేశారని భావిస్తున్నామన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఏపీఎన్జీఓ, రాష్ట్ర, జిల్లా ఆడిట్ శాఖ అధికారులకు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జోన్–2 అధికారులకు సోమవారం నోటీసులు అందజేశారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విక్రమ హాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమానికి చేసిన చట్టాలపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వల్లీ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కార్మికులది కీలక పాత్ర అని, వారి సంక్షేమం మెరుగైన సమాజానికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు, గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

రొట్టెల పంపిణీ

కడియం: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు ముత్యాలరావు ఆధ్వర్యంలో జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ శివశంకర్ పాల్గొన్నారు.

5న బుద్ధవిహారాలో ప్రత్యేక కార్యక్రమాలు

కడియం: వేమగిరి కొండపై గల బుద్ధవిహారాలో ఈ నెల 5వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకుడు యార్లగడ్డ జగదీశ్వరరావు (యాజరా) తెలిపారు. బుద్ధపూర్ణిమ (వైశాఖ పూర్ణిమ)ను పురస్కరించుకుని భారీ బుద్ధవిగ్రహం వద్ద ఆ రోజు ఉదయం 9.30 నుంచి బుద్ధవందనం, పరిత్రాణ, ధ్యానం, ప్రబోధాలు, ప్రముఖుల సందేశాలు జరుగుతాయన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

కడియం: మండల కేంద్రమైన కడియం ఆవలో వర్షానికి తడిసిన ధాన్యం, నేలనంటిన వరిపంటను ధాన్యం కొనుగోలు ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి వి.రాధాకృష్ణ సోమవారం పరిశీలించారు. తహసీల్దార్ ఎం.సుజాత, మండల వ్యవసాయశాఖాధికారి కె.ద్వారకాదేవితో కలిసి ఆవలో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని రాధాకృష్ణ హామీ ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఖాళీ షెడ్డులో ఆదివారం రాత్రి సుమారు 45 ఏళ్ల వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుడి చేతిపై రవికుమార్ అని తెలుగులో టాటూ వేసి ఉంది. దానిపైన ఆంజనేయస్వామి టాటూ కూడా ఉండటం గమనార్హం. చొక్కా కాలరుపై విజ్ టైలర్స్ రాజమండ్రి అని ప్రింట్ చేసి ఉంది. మృతుడి వివరాలు తెలిసినవారు చేబ్రోలు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ నంబరు 94407 96658కు గాని, గణపవరం సీఐ నంబరు 94407 96655కు గాని తెలియజేయాలని ఎస్‌ఐ స్వామి కోరారు.

కొనసాగిన పూజలు

మధురపూడి: బూరుగుపూడి శివారు ఊరచెరువు సమీపంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ నిర్మాణ కర్త అనంతాత్ముల బాలాజీ, ఉష దంపతులు పాల్గొన్నారు.

రాజమహేంద్రికి మణిహారం

- శరవేగంగా వైద్యకళాశాల పనులు
- నగరానికే తలమానికం
- పేదలందరికీ మరింత మెరుగైన వైద్యం



రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. రాజమహేంద్రవరంలో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కళాశాల నగరానికే తలమానికం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 16 మెడికల్ కళాశాలలను మంజూరు చేయగా వాటిలో రాజమహేంద్రవరం ఒకటి. దీనికి అనుసంధానంగా ఉన్న ప్రభుత్వాసుపత్రిని బోధన ఆసుపత్రిగా మార్చి వైద్యసేవలందిస్తోంది. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి బోధనాసుపత్రిగా మారడంతో పలు హంగులు సమకూర్చుకుంటోంది.

650 పడకలుగా..

ప్రభుత్వాసుపత్రి వైద్య విద్యాబోధనతో 650 పడకలుగా రూపాంతరం చెందనుంది. అన్ని విభాగాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో ఆసుపత్రి రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రభుత్వాసుపత్రిని బోధనాసుపత్రి స్థాయికి మార్చేందుకు మరో రూ.ఐదు కోట్లు నిధులు ఖర్చుచేస్తోంది. కొద్దిరోజుల క్రితం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని రాజమహేంద్రవరం విచ్చేసి మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. కళాశాలకు అనుసంధానమైన బోధనాసుపత్రిలో వైద్యసేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నగరానికి వన్నె తేనున్న మెడికల్ కళాశాల పనులను త్వరితగతిన పూర్తి చేసే దిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ దృష్టి సారించారు. రాజమహేంద్రవరంలో ఏర్పాటువుతున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ఆగస్టులో 150 వైద్య సీట్లకుగాను విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే వైద్య విద్య తరగతులు ప్రారంభించనున్నారు. నిర్మాణ బాధ్యతలు ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధికారులకు నిర్వహిస్తున్నారు.

పనులు వేగవంతం

ప్రభుత్వాసుపత్రి బోధనాసుపత్రిగా మారింది. మెడికల్ కళాశాల పనులు వేగవంతం అయ్యాయి. మెడికల్ కళాశాల రాకతో జిల్లా ఆసుపత్రి బోధనాసుపత్రిగా మారి కొత్త హంగులు తీసుకొచ్చాం. వైద్య సదుపాయాలు పెరిగాయి.

– డాక్టర్ మనోజ్, డిప్యూటీ సూపరింటెండెంట్, రాజమహేంద్రవరం

డీజీఎం వైవీ రావుకు ఘన సత్కారం



వైవీ రావు దంపతులను సత్కరిస్తున్న భరత్‌రామ్, తోట త్రిమూర్తులు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కందుల దుర్గేష్ తదితరులు

కడియం: ఏపీ పేపరుమిల్లు డీజీఎంగా ఉద్యోగ విరమణ చేసిన వైవీ రావు దంపతులకు మాధవరాయుడుపాలెంలో ఆదివారం రాత్రి ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైవీ రావు సేవలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), పేపరుమిల్లు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి



నల్లా చానల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం రాకుండానే నగరంలోని కాలువల్లో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదిక చేపట్టాలని పారిశుధ్య అధికారులకు కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశాలిచ్చారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచిపోయినట్టు అందిన సమాచారాన్ని తెలుసుకొని హుటాహుటిన నల్లా చానల్, కంబాలచెరువు, హైటెక్ బస్టాండ్ , కృష్ణా నగర్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పారిశుధ్య కార్మికులను అప్రమత్తం చేసి, పలు సూచనలు జారీ చేశారు. డ్రైనేజీలకు ఎక్కడైనా మైనర్ రిపేర్లు ఉంటే తక్షణమే పనులు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీల్లో చెత్తా చెదారం వేయకుండా తమకు సహకరించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ వి.వినూత్న, ఈఈ సాంబశివరావు ఉన్నారు.

స్పందనకు రెండు అర్జీలు



మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ గీతాంజలికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, చిత్రంలో ఎంపీడీవో రత్నకుమారి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చాయని మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలి తెలిపారు. హుకుంపేట శివాలయం వద్ద యేరుకొండ శ్రీను అనే వ్యక్తి ప్రభుత్వ స్థలంలో పాన్‌షాపు నిర్వహిస్తూ డ్రైనేజీని ఆక్రమించి ముందుకు వచ్చారని, దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని సామాజిక కార్యకర్త యు.రామకృష్ణ ఫిర్యాదు చేశారు. హుకుంపేటకు చెందిన తలారి నవీన్ రైస్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పటి వరకు తనకు రాలేదని అధికారులకు విన్నవించాడు. జూన్‌లో రైస్‌కార్డు మంజూరు అవుతుందని అధికారులు తెలిపారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, ఎంఈవో తులసీదాస్ పాల్గొన్నారు.

మండల స్పెషల్ ఆఫీసర్‌కు అభినందన

రాజమహేంద్రవరం రూరల్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలికి ఎంపీడీవో కె.రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సీటీఆర్ఐ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ చైత్రవర్షిణి, అధికారులు పాల్గొన్నారు.

పశుపక్ష్యాదుల దాహార్తినీ తీర్చండి



మజ్జిగ వితరణ చేస్తున్న ఉమర్ ఆలీషా

సీటీఆర్ఐ: మనుషులతో పాటు పశుపక్ష్యాదుల దాహార్తిని తీర్చడానికి నీటిని అందుబాటులో ఉంచాలని విశ్వవిజ్ఞాన విద్యాఆధ్యాత్మిక పీఠం ప్రస్తుత నవమి పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. సోమవారం స్థానిక గౌతమ్ ఘాట్ వద్ద గల ఆశ్రమ శాఖ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎన్నో చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కుసుమంచి రాంకుమార్, ఉషాకిరణ్, అనూప్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

మంగారాణికి అభినందనలు



మంగారాణిని సన్మానిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి

కంబాలచెరువు: స్థానిక నాగరాజా మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి అరుదైన ఘనత సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచి పాఠ్యాంశాల ఈ కంటెంట్ రూపకల్పనకు రాష్ట్రంలో వివిధ పాఠశాలల నుంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి అమరావతిలో వర్క్‌షాప్ ఏర్పాటు చేసింది. గత నెల 30న ప్రారంభమైన ఈ వర్క్‌షాపు ఈనెల 2 వరకూ జరుగుతుంది. ఈ సందర్భంగా మారిన నూతన పాఠ్య పుస్తకాల క్యూఆర్ కోడ్ అనుసంధానం విషయంలో విశేష కృషి చేసిన మంగారాణిని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి శాలువాతో సన్మానించారు. మంగారాణి లెసన్స్ పేరుతో ఆమె నిర్వహిస్తున్న యూట్యూబ్ చానల్ పాఠాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయని ప్రశంసించారు.

హిందూధర్మ ప్రచార కమిటీ కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న నీలకంఠరావు

కడియం: హిందూధర్మ ప్రచార కమిటీ కడియం మండలం నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. కడియంలో ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా ఆచార్యులు మాస్టారు, అధ్యక్షుడిగా బోణం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఉప్పులూరి సదానందం, ప్రధాన కార్యదర్శిగా డీటీవీఎస్ నాగేంద్ర, సంయుక్త కార్యదర్శిగా పున్నమరాజు వీర్రాజు, ప్రచార కార్యదర్శిగా చిరుకూరి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బడిగంటి సూర్యనారాయణ, కార్యదర్శులుగా మరో పదకొండు మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సమితి వ్యవస్థాకులు ఉప్పులూరి చిట్టియ్య మాట్లాడుతూ హిందూమతం ప్రపంచానికి దిక్సూచి లాంటిదన్నారు. సమన్వయకర్త డి.నీలకంఠరావు మాట్లాడుతూ హిందూమతం ఒక జీవన విధానమని, దాన్ని మరింత ప్రచారం చేయాల్సి ఉందన్నారు.

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

సీటీఆర్ఐ: పింఛన్ల పంపిణీ సోమవారం తెల్లవారుజామునే ప్రారంభమైంది. జోరువానలోనూ వలంటీర్లు పింఛన్ల పంపిణీని కొనసాగించారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో తొలిరోజే 78 శాతం పంపిణీ చేశారు. అర్బన్ పరిధిలో 29,363 మంది లబ్ధిదారులకు రూ.8,21,53,250 ప్రభుత్వం విడుదల చేసింది.



41వ డివిజన్‌లో మహాలక్ష్మీరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సావిత్రి



36వ సచివాలయ పరిధిలో సత్యవతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఫాతిమా బీబీ

బంగారం, నగదు అపహరణ

కంబాలచెరువు: మెరక వీధికి చెందిన నల్ల హరినాథ్ తన కుమార్తె కలిసి గత నెల 29న వంట పనిచేసేందుకు వెళ్లారు. తిరిగి మర్నాడు మధ్యాహ్నం వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 20 గ్రాముల బంగారం, రూ.30 వేలు నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారికి మే 20 వరకు శిక్షణ తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. సప్లిమెంటరీ పరీక్షలపై సోమవారం విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మే 24 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మే ఒకటి నుంచి 20 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 చోట్ల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కడియంలో ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

కడియం: స్థానిక ఎస్సీ కాలనీ వాసులను ఏళ్ల తరబడి ఇబ్బంది పెడుతున్న లోఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. అక్కడ ఉండే 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు అధికం కావడంతో వినియోగదారులు ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే బాధలు వర్ణనాతీతం. ఇటీవల ఈ సమస్యపై స్థానికులు చేసిన విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ ఏఈ రామారావు ఆధ్వర్యంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి దీనిని వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

- వాడవాడలా మేడే వేడుకలు
- ఎర్రజెండా రెపరెపలు



కంబాలచెరువు సెంటర్‌లో కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



హైటెక్ బస్టాండ్ వద్ద కార్మికులతో కలసి కేక్ కట్ చేస్తున్న రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను నగరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్మికులు ఎర్రజెండాలతో కదం తొక్కారు. కంబాలచెరువు సెంటర్‌లోని మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటే యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అని, పేరులోనే శ్రామిక ఉందని, కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నరవ గోపాలకృష్ణ, లంక సత్యనారాయణ, బొంత శ్రీహరి పాల్గొన్నారు.

- కంబాలచెరువు ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్ దగ్గర వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన కేక్ కట్ చేశారు.
- కార్మిక నాయకుడు, అమ్మా సేవాసమితి అధ్యక్షుడు కరిమెండి విజయ్ ఆధ్వర్యంలో స్థానిక స్వరూప నగర్‌లో ది నేషనల్ బిల్డింగ్ పెయింట్ – సీలింగ్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ రాజమండ్రి అధ్యక్షుడు వై. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



బొమ్మూరు పంచాయతీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను

లౌకిక వ్యవస్థలకు మోదీ తిలోదకాలు

ప్రకాశం నగర్: ప్రజాస్వామ్యంలో లౌకిక వ్యవస్థలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తిలోదకాలు ఇస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ జట్లు లేబర్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా జట్లు లేబర్ యూనియన్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు, మసీద్ సెంటర్, సీపీఐ కార్యాలయం, బైపాస్ రోడ్డు, అశోక థియేటర్, ఆజాద్ చౌక్, జాంపేట, సోమాలమ్మ గుడి సెంటర్ మీదుగా కూరగాయల మార్కెట్ వరకూ ప్రదర్శన చేశారు. అక్కడ మేడే జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన 9 సంవత్సరాల్లో పేదవాడికి ఒరిగింది ఏమి లేదన్నారు. జిల్లా అధ్యక్షుడు తాటిపాక మధు, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు .

ఐక్యంగా పోరాడాలి

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. సీపీఎం, సీఐటీయూ శ్రేణులు నగరంలోని నందం గనిరాజు సెంటర్, శ్యామల సెంటర్, మున్సిపల్ ఆఫీస్, ప్రకాశం నగర్ , ఆవ వాంబే గృహాలు, నారాయణపురం వాంబే గృహాలు, పేపర్ మిలు సెంటర్ ప్రాంతాల్లో జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడారు.

- ఐఎఫ్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాలు, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐదుబళ్ల మార్కెట్ వద్ద ఐఎఫ్‌టీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో వాసంశెట్టి భద్రం జెండాను ఆవిష్కరించారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో మేడే వేడుకలకు సోమవారం ఘనంగా నిర్వహించారు. కడియం దేవీచౌక్ సెంటర్‌లో విఘ్నేశ్వర తాపీపనివారల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మేడే స్ఫూర్తితో శ్రమజీవులు భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. దుళ్లలో మేడే జెండాను పార్టీ నాయకులు పితాని ధనలక్ష్మి ఆవిష్కరించారు. రైతు కూలీ సంఘం నాయకులు పారిపల్లి అప్పారావు, పువ్వుల నాగేశ్వరరావు, గడ్డియ్య పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గ్రామంలోని సర్ ఆర్థర్ కాటన్ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద అధ్యక్షుడు పందెళ్ల భానుప్రసాద్ జెండా ఎగురవేశారు. కార్మికులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎస్‌కే వలీ, ఎం.రమణ, ఋషేంద్ర పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

రాజమహేంద్రవరం రూరల్: కార్మికుల శ్రేయస్సు కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు(అను) అన్నారు. బొమ్మూరు పంచాయతీ ఆవరణలో కార్మికుల సమక్షంలో ఆయన ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటిపల్లి రవిప్రసాద్, అనుసూరి మధు, మల్లిపూడి సురేష్, గణేష్ పాల్గొన్నారు.

▸▸ జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల అధ్యక్షుడు గుబ్బల రాంబాబు మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం ప్రాంగణంలో జెండా ఆవిష్కరించారు. ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శి ఎం కోదండరామ్, ఆంధ్ర కర్ణాటక తెలంగాణ అధ్యక్షుడు పి.సతీష్ మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా పోరాడి ఉన్న హక్కులను, ఉద్యోగాలను నిలుపుకొనే ప్రయత్నం చేయాలన్నారు. ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.గన్నెయ్య, సీహెచ్ సత్యదేవ, ఏకే విశ్వనాథ్, ఈశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.